

# జానకి కొడుకు

కుమారి నాగమణి

ఉలిక్కిపడుతూ లేచికూర్చుంది జానకి. బయట వరండాలో చప్పుడు. దానికితోడు ఎవరో తలుపుకొడుతున్నారు. లేచివెళ్ళి తలుపుతీసింది. ఎదురుగావున్న వ్యక్తిని చూస్తూనే ఆశ్చర్యపోయింది

'ఆశ్చర్యపోతున్నావా చెల్లాయ్ చెప్పాపెట్టకుండా వచ్చానని' లోపలికివస్తూ అన్నాడు గోపాల్.

తృప్తిగా నవ్వుతూ సూట్‌కేసు అందుకొని లోపలికి నడిచింది జానకి.

'బావగారేరీ? ఇంకా ఆఫీసునుంచి రాలేదా?"

జానకి గుండెల్లో రైళ్ళుపరిగెత్తాయి గోపాల్ ప్రశ్నతో

క్యాంపు వెళ్ళారన్నయ్యా" అంది మెల్లిగా.

గోపాల్ ఒళ్ళు తుడుచుకొని వచ్చేసరికి కాఫీ తయారుచేసి యిచ్చింది జానకి.

చిక్కిపోయావేం జానకీ?" అన్నాడు గోపాల్ కాఫీ త్రాగుతూ

నేనా...భలేవాడివే అన్నయ్యా.. చాలారోజులకు చూసావుకదూ .. అందుకే అలా కనిపిస్తున్నానే కాని నేనేం చిక్కిపోలేదు!" అంది.

'అమ్మ వాళ్ళు ఖులాసాగా వున్నారా? సరళ బావుందా? అంది తిరిగి జానకి

ఆఁ ..అంతా ఖులాసాయె...రాజమండ్రిలో రాముం పెళ్ళికి వెళ్ళవస్తూ అలాగే అమ్మ నిన్ను తీసుకురమ్మంది. ఇంతకీ బావగా రెప్పుడెళ్ళారు? ఎప్పుడొస్తారూ?"

'వారు పొద్దున్నె వెళ్ళారన్నయ్యా ... ఎప్పుడొస్తారో తెలీదూ' అంది కాసేపటికి.

బావగారి నడిగి రీపుకు వెళ్దామంటే లేరాయె.. పోని ఉత్తరం వ్రాస్తాను నేను. రాకూడదూ?"

మీ బావగారు లేంది ఎలా రాను ... రాగానే నేనడిగి వస్తాగా."

'కాదు జానకీ...సరళకు సంబంధం కుదిరింది. నీకు తెలుసుకదూ ... శుక్రవారంనాడు వాళ్ళు తాంబూలాలు పుచ్చుకుందామన్నారు నువ్వుంటే బావుంటుందని నిన్ను తీసుకురమ్మని అమ్మ మరీ మరీ చెప్పింది."

"నేను బావగారికి ఉత్తరం వ్రాస్తాగా జానకి నిన్ను తీసికెళుతున్నట్టుగా. బావగారు చాలా మంచివారు ఏమి అనరు ... బావగారేవూరు వెళ్ళారేమిటి?"

జానకికి ఏం చెప్పాలో తోచలేదు. కాసేపు తమాయించుకొని 'నాకు తెలీదన్నయ్యా ..నేనడగలేదు.. అడిగితే చెప్పేవారే. .ఆత్రుతగా అనుకోకుండా వెళ్ళారు" అంది చివరికి.

"మరీ అంత అమాయకత్వ మేమిటి జానకీ... ఎంత తొందర, ఆత్రుతవున్నా వెళ్ళే మనిషిని ఏ ఊరికని అడగలేమా? ఎప్పుడొస్తారో అడగలేవా.. ఊఁ...సరేలే బాబిగాడేడీ..నిద్రపోయాడా?"

'అవునన్నయ్యా .. ఇందాకె నిద్రపోయాడు" అంది జానకి ఏదో పనివున్నట్లుగా వంటింట్లోకి పోతూ.

* * *

గోపాల్ భోజనం ముగించుకొని నిద్రపోయాడు. జానకి వంటిల్లు సర్దేసి తన గదిలోకి పోయింది.

"మరీ అంత అమాయకత్వమేమిటి జానకీ" గోపాల్ మాటలె చెవుల్లో గింగుర్లెత్తాయి.

'అవునన్నయ్యా ... నా అమాయకత్వాన్నే అలుసుగాతీసుకొనే వారు నన్ను నిర్లక్ష్యంగా వదలి పోగలిగారు. ఆడంబరాలకూ నిజావలిచ్చి

గౌరవించే ఆయనకు నాతో సంసారం చెయ్యడమే కంటకమైపోయింది. ఆడంబరం, అతిశయమే జీవితం అనుకుని నన్ను చులకనచేసి కమలతో వెళ్ళిపోయారన్నయ్యా...వెళ్ళిపోయారు" దిండులో మొహం దాచుకుని బావురుమంది జానకి.

పదిహేనురోజుల క్రింద జరిగిన సంఘటన కళ్ళముందు కదిలింది జానకికి.

ఆ రోజు...వంటపని చేసుకుంటోంది జానకి. తలుపు చప్పుడు కావడంతో వెళ్ళి తలుపు తీసింది.

"రఘుగారున్నారా" అంది ఎదురుగా నిలబడ్డ అమ్మాయి.

"లేరు, కాసేపట్లో వస్తారు" అంది జానకి.

ఆ అమ్మాయి అలాగే నిలబడ్డంతో.

"రండి లోపలికి" అంది.

ఆ అమ్మాయి లోపలికొచ్చి కూర్చుంది.

పరీక్షగా చూసింది జానకి ఆ అమ్మాయిని. కళ్ళకు నల్లటి అద్దాలు. నొసట కనీకనపడని తిలకం, పెదవులకు లిప్‌స్టిక్, రెండుజడలు, పల్చటి నైలాన్ చీర, ఎత్తుమడాల జోళ్ళు ... నవనాగరీకంగా వుంది.

బిత్తరపోయి చూస్తున్న జానకితో.

"మీరూ..."అంటు ఆగిపోయింది.

"వారి భార్యను" అంది. ఆ అమ్మాయి చిన్నగా నవ్వినట్లనిపించింది జానకికి.

"ఉండండి కాఫీ తీసుకొస్తాను", అంటు లోపలికెళ్ళి కాఫీ తెచ్చేసరికి రఘువచ్చి ఆ అమ్మాయితో మాట్లాడుతున్నాడు. జానకిని చూస్తూనే "జస్ట్...వెయిట్ కమలా... నే ఇప్పుడే వస్తా" నంటు వెళ్ళి మొహం కడుక్కొని, డ్రస్ మార్చుకొని వెళ్ళిపోయాడు. గుడ్లప్పగించి చూస్తుండిపోయింది జానకి.

ఆ మర్నాడు సాయంత్రానికి తిరిగొచ్చాడు రఘు.

"ఎవరండి ఆ అమ్మాయి?" అంది జానకి.

"నా స్నేహితురాలు... ఏం".

"అబ్బే ..ఏంలేదూ..." అంది.

"ఆ అమ్మాయి అడిగితే భార్యనని చెప్పావుట."

"అవును" అంది.

"అప్పుడు నీ అవతారం ఎలావుందో తెలుసా!"

"తెలుసు" అంది మొండిగా.

"ఏమిటి తెలుసు...పనిమనిషికంటే హీనంగా వున్నావ్. నా భార్యనని చెప్పుకోవడానికి నీకు సిగ్గెట్లాలేకపోయింది."

"వాస్తవం చెప్పడానికి సిగ్గుపడ్డందేనికి?"

"దేనికా..నీకాఅర్హత లేదుకనక. ఆ అమ్మాయి ఏమందో తెలుసా? ముందుగా నీ మిసెస్ అనుకోలేదు చెప్పేవరకు అని అంది."

"మీరే అంటున్నారుగా మీ కంటికి పనిమనిషి కంటే హీనంగా కన్పిస్తున్నానని. ఆ అమ్మాయి అనుకోవటంలో ఆశ్చర్యం ఏముంది" అంది వ్యంగ్యంగా.

జానకి మాటలు పూర్తికాకముందే రఘు బాచి చెంపకాయ కొట్టాడు.

"ఈ మధ్య మాటకి మాటనడం ... ఎదురు తిరగడం ఎక్కడ నేర్చుకున్నావ్? చెప్పినట్టు విని ఓమూల పడివుండు."

జానకిలో ఓర్పు నశించిపోయింది. కందిన చెంపను చేత్తో తడుముకుంటూ 'ఇన్నాళ్ళు అలా ఓ మూల పడివుండటం మూలానే మీ కంటికి నేను పనిమనిషికంటే హీనంగా కన్పిస్తున్నాను ... నా మూగతనాన్ని ఆసరాగా తీసుకొని నా ముందే మరో అమ్మాయితో షికార్లు నిర్భయంగా చేయగలుగుతున్నారు. అలాంటివారు నన్నో మూల పడివుండమనక మరెక్కడుండమంటారు చెప్పండి" అంది జానకి.

"నోర్మూయ్ ..ఆ అమ్మాయి పేరె త్తకు...నేనా అమ్మాయిని ప్రేమిస్తున్నాను. పెళ్ళిచేసుకుంటాను."

"మీరు మళ్ళీ పెళ్ళిచేసుకుంటారా?"

"అవును...ఏం ... నేనా అమ్మాయిని ప్రేమిస్తాను అని చెప్పానుగా"

"మరి నన్నెందుకు చేసుకున్నారు?"

"ఖర్మందాలక ... నువ్విలాంటి మొద్దవతారానివని... బి. ఏ. నాటి అప్పలమ్మవని అనుకోలేదు ...నిన్ను నే నెప్పుడూ ప్రేమించలేదు ...లేను"

"మీరు ప్రేమించేది ఆ అమ్మాయిని కాదండి. ఆ అమ్మాయి ఆడంబరాలను, అతిశయాలను. నేనలా వుండలేననేగా ప్రేమించలేదంటున్నారు. నేనేం తప్పుచేశాను చెప్పండి ... అన్యాయంగా నన్ను హింసిస్తున్నారు. నేను ఆడదానిగా పుట్టడం తప్పా? అణుకువ కలిగిన ఇల్లాలుగా వుండడం నేరమా?"

"తప్పా...తప్పున్నరా ... అణుకువ కలిగిన ఇల్లాలు భర్త నెదిరించి మాట్లాడుతుందా నీలాగా"

"అవును మాట్లాడదు ... కాని ఓర్పు అనేది ఇన్నాళ్ళు నాలో వుంది కాబట్టి అర్ధరాత్రిళ్ళు ఇల్లు చేరినా, తిట్టినా, కొట్టినా భరించి ఊరుకున్నాను. ఈనాడు ఆ ఓర్పు లేకుండా చేశారు మీరు.ఇన్నాళ్ళు పెదవి విప్పి ఇదేమని అడగలేదు. కాని నా ముందే మరో అమ్మాయితో తిరుగుతూ మళ్ళీ పెళ్ళిచేసుకుంటానంటే ఏ ఇల్లాలూ ఊరుకోదు."

"ఏం ఊరుకోక ఏం చేస్తావ్...నా యిష్టానికి నువ్వేమిటి మధ్యలో?"

"అగ్ని సాక్షిగా పెళ్ళాడిన భార్యను."

"ఓహో! ...అయితే సరే...ఇవాల్టినుండి ఆ స్థానం నీకు లేదు."

"మీ రన్నంతమాత్రానా నా స్థానం పోతుందా".

'వుంటుందో పోతుందో కాచుకుని చూస్తుండు. నీకు నాకు ఏ సంబంధంలేదని విడాకులిస్తాను."

"విడాకులా?..." నిశ్చేష్ట అయిపోయింది జానకి. "ఏమని ఇస్తారు ... నా తప్పేమిటి".

"ఇంటికి రావడంతోనే రాచిరంపాన పెడుతోందని... ప్రవర్తన బావులేదని".

"నేనా... నా ప్రవర్తన బావులేదా... నిజంగా మీరు మనస్ఫూర్తిగా అంటున్నారా యీ మాటలు!"

"అవును! మనస్ఫూర్తిగానే అంటున్నాను".

జానకిలో ఏ మూలోవున్న సహనంకూడా నశించిపోయింది.

'ఎవరు ఎవరిని రాచిరంపాన పెడుతున్నారో ఎవరి ప్రవర్తనబావులేదో...".

"తెలుస్తుందిలే నీ ఖర్మకూడా" అంటూ విసురుగా వెళ్ళిపోయాడు రఘు.

జానకి కన్నీటితో తలగడంతా తడిసిపోయింది

* * * *

ఇరవై ఏళ్ల కాలప్రవాహంలో గడిచిపోయాయి. జానకి, గోపాల్‌తో పుట్టిల్లుచేరి స్కూల్లో టీచరుగా పనిచేస్తోంది. కుమార్ బి. ఏ చదువుతున్నాడు. ఈ మధ్యకాలంలో జానకి పూర్తిగా మారిపోయింది. తన జీవితమంతా కుమార్ కోసమేనంటూ జరిగిందంతా మర్చిపోయి కుమార్‌ని ఉన్నత ఆదర్శాలు గల వ్యక్తిగా తీర్చిదిద్దింది.

"అమ్మా!...నే రాసిన ఇల్లాలు నాటకం కాలేజి డే రోజు ప్రదర్శిస్తున్నారు. అందులో నేనే ముఖ్య పాత్రధారిని. నువ్వు తప్పకుండా రావాలి." అన్నాడు కుమార్ ఇన్విటేషన్ కార్డు అందిస్తూ. కార్డులో చీఫ్‌గెస్టు పేరు చూస్తూనే ఉలిక్కిపడి.

"నేనెందుకు బాబి...నాకు స్కూలుంటుంది... అలసిపోయివస్తాను. నే రాలేను. మావయ్యను తీసికెళ్ళు" అంది.

"నామీద ఒట్టేనమ్మా నువ్వు రాకపోతే..." అన్నాడు కుమార్

సమయానికి తప్పుకోవచ్చుని పెదవి మెదపకుండా తలూపింది జానకి.

"అతను వస్తే మాత్రం భయం ఏమిటి జానకీ ...తండ్రిగా తన బాధ్యత విస్మరించినా తల్లిగా నీ బాధ్యత నువ్వు నిర్వర్తించి కొడుకునింత ప్రయోజకుణ్ణి చేశావు. చూసి సిగ్గుపడతాడు...అతిశయం, ఆడంబరాలకు విలువనిచ్చి నిన్ను విడిచిపోయినా, అతడు మాత్రం ఏం బావుకున్నాడు. తగిన ఆస్తి జరిగి, ఒంటరిగా కాలం గడపడం లేదూ...కనీసం నీ విలువ గుర్తించని వాడు ఈ నాడయినా నిన్ను చూసి పశ్చాత్తాప పడతాడు." అని గోపాల్ జానకితో అనటం కుమార్ స్పష్టంగా విన్నాడు.

వచ్చే గెస్టు తన తండ్రే అని తెలియడంతో జానకిని మరింత బలవంతంచేసి తీసికెళ్ళాడు.

నాటకం పూర్తి అయ్యింది. జానకి కన్నీళ్ళను తుడుచుకుంది.

"నీ కొడుకనిపించుకున్నాడు జానకి" అన్నాడు గోపాల్.

'నేటి ఆడంబరాలను, అతిశయాలను చక్కగా విశదీకరించి, చివరికి దాని ఫలితాన్ని చక్కగా చూపించి ఆడంబరాలకు, అతిశయాలకు పరుగులు తీస్తూ స్త్రీని ముఖ్యంగా భార్యను అర్థం చేసుకోని నీతాపతి పాత్ర. నేటి యువకులకు చక్కటి మార్గదర్శకంగా వుంది. నాటక రచయితగా, ముఖ్య పాత్రధారిగా తన ప్రతిభను చూపించిన కుమార్‌కు నా ప్రత్యేక బహుమతి ఇవ్వాలనుకుంటున్నాను" అంటూ రఘురాం స్పీకర్‌లో చెప్పడంతో కుమార్ స్టేజిపై కెక్కాడు.

"చాలా చక్కగా, ఆదర్శవంతంగా వుంది నాటకం...ఎవరబ్బాయివి బాబూ నువ్వు!" అన్నాడు రఘురాం, బహుమానం ఇచ్చాక.

"భర్తగా మీ అర్హత పోగొట్టుకుని, కొడుకును, భార్యను బాధ్యతారహితంగా వదిలిపెట్టి, ఆడంబర అతిశయాలంటూ మీరు విడిచిపెట్టి పోయిన... ఇల్లాలు . జానకి కొడుకుని నేను" ... అన్నాడు కుమార్.

★